హడలెత్తిస్తున్న దొంగలు


కేవీ రెడ్డి నగర్‌లో చోరీపై ఆరా తీస్తున్న డీఎస్పీ జనార్ధన్‌నాయుడు (ఫైల్ ఫోటో)


ఐశ్వర్య విల్లాస్‌లో ఇంట్లోని వస్తువులను చెల్లాచెదురుగా చేసి, చోరీకి పాల్పడిన దృశ్యం (ఫైల్)

- వరుస చోరీలతో ప్రజల బెంబేలు
- భయం గుప్పిట్లో తాడిపత్రి వాసులు
- పోలీసులకు సవాల్ విసురుతున్న వైనం

తాడిపత్రి: పట్టణంలో వరుస దొంగతనాలతో ప్రజలు హడలెత్తిపోతున్నారు. చీకటి పడితే ఏ ఇంటికి కన్నం పడుతుందోనని ఆందోళన చెందుతున్నారు. కేవలం 3 రోజుల వ్యవధిలో 5 దొంగతనాలు జరగడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది. దొంగలు రాత్రి, పగలు తేడా లేకుండా దొంగతనాలు చేయడం ద్వారా పోలీసులకు సవాల్ విసిరినట్లయింది. కష్ట పడి సంపాదించిన సొమ్మును ఇలా అప్పనంగా ఎత్తుకుపోతే తమ భవిష్యత్తేంటని బాధితులు వాపోతున్నారు.

భారీ బందోబస్తు ఉన్నా...

తాడిపత్రిలో పోలింగ్ అనంతరం జరిగిన అల్లర్ల నేపథ్యంలో పట్టణంలోకి వచ్చే రూరల్ పరిధిలోని ప్రధాన రహదారి కూడళ్లలో పోలీసు పికెట్లను ఏర్పాటు చేశారు. తాడిపత్రిలో పెద్ద ఎత్తున పోలీసు బందోబస్తు కొనసాగుతోంది. రోజూ పోలీస్ పెట్రోలింగ్ వాహనాలు గస్తీని కాస్తున్నా ఇంతలా బరితెగించి మరీ పగలనకా రేయనకా దొంగలు యథేచ్ఛగా చోరీలకు పాల్పడుతుండటం విస్మయం కలిగిస్తోంది. వరుస చోరీలు చివరకు పోలీసుల సమర్థతను ప్రశ్నించే పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా పోలీసులు చోరులను పట్టుకుని ప్రజలకు న్యాయం చేస్తారో లేదో వేచిచూడాల్సిందే.

తాడిపత్రి ప్రాంతంలో జరిగిన చోరీలు ఇలా..

- ఈ నెల 6 వ తేదీ గురువారం అర్ధరాత్రి తాడిపత్రి రూరల్ పరిధిలోని ఐశ్వర్య విల్లాస్‌లో నివాసం ఉంటున్న సుధాకర్ ఇంటిలో దొంగలు పడి ఇంట్లోని నగదుతో పాటు దాదాపు 3 కిలోల వెండి సామగ్రిని ఎత్తుకెళ్లారు.
- ఈ నెల గురువారం 6 వ తేదీన అర్ధరాత్రి రూరల్ పరిధిలోని మై ల్యాండ్ బ్యాంక్ కాలనీలో ఓ ఇంటిలోకి దొంగతనం చేసేందుకు వచ్చిన దొంగలను పక్కింటి వారు చూసి కేకలు వేయగా, వారు అక్కడ నుండి పారిపోయారు. సీసీ టీవీ కెమెరాల్లో వచ్చిన దొంగల ముఠా వీడియో రికార్డింగ్ అయింది.
- ఈ నెల 7న అర్ధరాత్రి తాడిపత్రిలోని పుట్లూరు రోడ్‌లో ఏకంగా 3 షాపుల్లో చోరీ చేశారు. అందులో శ్రీ రంగనాయక స్వామి ఆయిల్ ట్రేడర్స్ అండ్ జనరల్ స్టోర్‌లో రూ.20 వేలు నగదు, కమల్‌నాథ్ గానుగ ఆయిల్‌లో రూ. 27 వేలు నగదు, రూప మెడికల్స్ అండ్ జనరల్స్‌లో రూ.3 వేల నగదును ఎత్తుకెళ్లారు.
- ఈ నెల 10 న ఉదయం తాడిపత్రిలో పట్టపగలే దొంగలు బరితెగించి మరీ కేవీరెడ్డి నగర్‌లోని ఓ ఇంటిలోకి వెళ్లి సరోజమ్మ అనే గృహిణిని బ్లేడుతో చేతులు కోసి, ఆమె ఒంటిపై ఉన్న 12 తులాల బంగారాన్ని దోచుకెళ్లారు.
- ఈ నెల 11 ఉదయం పట్టణ పోలీస్‌స్టేషన్‌కు సమీపంలోనే పుట్లూరు మండలం సూరేపల్లికి చెందిన ఆంజనేయులు బ్యాంకు నుంచి డ్రా చేసుకుని వచ్చిన రూ.60 వేలను దొంగలు ఎత్తుకెళ్లారు.

క్లుప్తంగా

ఆగని వర్షం... జనజీవనం అస్తవ్యస్తం


పామిడిలోని మదీనాకాలనీలో ఇళ్ల నడుమ వర్షపు నీరు

పామిడి: మండలంలో వారంరోజులుగా ఎడతెరపి లేకుండా వర్షం కురుస్తోంది. దీంతో జనజీవనం అస్తవ్యస్తమైంది. మండల కేంద్రంలోతట్టు ప్రాంతాలైన మదీనాకాలనీ, బీసీ కాలనీ, వీకే ఆదినారాయణరెడ్డి కాలనీ, చైతన్యకాలనీ, వెంగమనాయుడు కాలనీ, సీఎస్ఐ చర్చి వీధి, మడికట్ల ఆంజనేయస్వామి తదితర వీధులు వర్షపునీటి మయమయ్యాయి. మరి ముఖ్యంగా మదీనాకాలనీలో ఇళ్ల నడుమ వర్షపునీటి నిల్వతో ద్వీపకల్పాన్ని తలపిస్తోంది. విషపురుగుల సంచారంతో కాలనీవాసులు బెంబేలెత్తుతున్నారు. గుత్తి బీసీసీరోడ్డు వర్షపునీటి నిల్వతో మడుగును తలపిస్తోంది. దీంతో పాదచారులు, వాహనచోదకుల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

ప్రశాంతంగా జీవించండి

పుట్లూరు: వివాదాలకు దూరంగా ప్రశాంతంగా జీవించాలని ఎస్ఐ హేమాద్రి ప్రజలకు సూచించారు. బుధవారం మండలంలోని కడవకల్లు, ఓబుళాపురం, సూరేపల్లి తదితర గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో వివాదాస్పద వ్యక్తులపై నిఘా ఉంటుందని, ఘర్షణలకు పాల్పడినా, ప్రేరేపించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఉద్యోగాలకు ఎంపికైన 'గేట్స్' విద్యార్థులు


ఉద్యోగాలు సాధించిన గేట్స్ విద్యార్థులు

గుత్తి: పట్టణంలోని గేట్స్ ఇంజినీరింగ్ కాలేజీలో బెంగుళూరుకు చెందిన ఇంటెలి ప్యాట్ అనే సాఫ్ట్‌వేర్ కంపెనీ ప్రతినిధులు బుధవారం క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఇందులో ఎంబీఏ, ఎంసీఏ ఫైనలియర్ చదువుతున్న రోహిణి, చేతన్ బాబు, షిరీన్ మెహక్ అత్యంత ప్రతిభ కనబరిచారు. దీంతో కంపెనీ ప్రతినిధులు వీరిని ఉద్యోగాలకు ఎంపిక చేశారు. ఒక్కొక్కరికి వార్షిక వేతనం రూ.9 లక్షలు ఇవ్వనున్నట్లు ప్లేస్‌మెంట్ ఆఫీసర్ తనీవ్ర్ వెల్లడించారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను గేట్స్ కరస్పాండెంట్ వీకే పద్మావతమ్మ, డైరెక్టర్ వాణి, ఎండి రఘునాథ్ రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ సురయ అభినందించారు.

గార్లదిన్నెలో మోస్తరు వర్షం

గార్లదిన్నె: మండల కేంద్రం గార్లదిన్నెతో పాటు పలు గ్రామాల్లో బుధవారం ఓ మోస్తరు వర్షం కురిసింది. ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తుండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు సకాలంలో కురుస్తుండడంతో ఆయా గ్రామాల్లో రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. బీడు భూముల్లో పచ్చిగడ్డి మొలవడంతో దీంతో పాడి, పశువుల పెంపకదారులు, సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

కందుల కోసం రిజిస్ట్రేషన్ చేయించుకోండి

పుట్లూరు: రైతులు ఖరీఫ్‌లో సాగు చేయడానికి విత్తన కందుల కోసం రైతు భరోసా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి కాత్యాయని బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలానికి 50 క్వింటాళ్ల కందులు(ఎల్ఆర్‌జీ–52 రకం) కేటాయించారని, 4 కిలోలు రూ.392ల చొప్పున రైతులకు అందజేస్తామని పేర్కొన్నారు.

విజ్ఞాన్ స్కూల్‌ను సీజ్ చేయాలి


కమిషనర్‌తో మాట్లాడుతున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

గుంతకల్లు: ఎలాంటి అనుమతులు లేకుండా బుక్‌స్టాల్ నిర్వహిస్తున్న విజ్ఞాన్ స్కూల్‌ను సీజ్ చేయాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ గుంతకల్లు నియోజకవర్గ అధ్యక్షుడు వినోద్ మాట్లాడుతూ భాగ్యనగర్‌లోని విజ్ఞాన్ స్కూల్ ఎదురుగా ఓ ఇంటిని తీసుకుని అందులో బుక్‌స్టాల్‌ను నిర్వహిస్తున్నారన్నారు. ఈ షాపు అనంతపురంలోని ఓ బుక్ సెంటర్ పేరిట రిజిస్ట్రేషన్ అయ్యిందని, జీఎస్టీ నంబర్ కూడా దాన్ని చూపిస్తున్నారని ఆరోపించారు. నిబంధనలకు వ్యతరేకంగా నిర్వహిస్తున్న ఈ స్కూల్‌ను సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. ఏఐఎస్ఎఫ్ నాయకులు శివమణి, రాజ్‌కుమార్, రోహిత్, సురేష్, హేమంత్ పాల్గొన్నారు.

పాడి ఉంటే వ్యవసాయం లాభసాటి

- పంట మార్పిడితో ప్రయోజనం
- నాణ్యమైన విత్తనం ఎంచుకోవాలి
- డీఆర్‌సీ ప్రాజెక్ట్ డైరెక్టర్ మద్దిలేటి


మాట్లాడుతున్న జిల్లా వనరుల కేంద్రం ప్రాజెక్ట్ డైరెక్టర్ మద్దిలేటి

కూడేరు: రైతు ఇంట పాడి పెంపకం ఉంటే వ్యవసాయం లాభసాటిగా మారుతుందని జిల్లా వనరుల కేంద్రం (డీఆర్‌సీ) ప్రాజెక్ట్ డైరెక్టర్ మద్దిలేటి అన్నారు. బుధవారం కూడేరు వ్యవసాయ కార్యాలయంలో ఖరీఫ్ పంటల సాగుపై రైతులకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాడి పెంపకం ఉంటే పాల దిగుబడితో ఆదాయం వస్తుందని, మరోపక్క భూసారం పెంచే పేడ లభ్యమవుతుందని పేర్కొన్నారు. క్రమం తప్పకుండా రసాయనిక ఎరువుల వాడితే పెట్టుబడి పెరుగుతుందని, భూమిలో కర్బన్ శాతం తగ్గిపోతుందన్నారు. తద్వారా పంట దిగుబడి ఆశించిన స్థాయిలో రాక నష్ట పోవాల్సి వస్తుందని తెలియజేశారు. రైతులు వేరుశగన, ఆముదం, కంది వంట పంటలను ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేస్తే అధికంగా దిగుబడులు సాధించడానికి అవకాశముంటుందన్నారు. భూసార పరీక్షల ఆధారంగా పంటలు సాగు చేసుకోవాలని సూచించారు. నాణ్యమైన విత్తనాలు ఎంపిక చేసుకోవాలన్నారు. ఎప్పుడూ ఒకే రకం పంటలు సాగు చేస్తే భూసారం తగ్గుముఖం పడుతుందని చెప్పారు. పంట మార్పిడి చేయడం శ్రేయస్కరమని సూచించారు. తెగుళ్ల నివారణకు వ్యవసాయాధికారుల సూచనల మేరకు మందులు పిచికారీ చేసుకోవాలన్నారు. అనంతరం సిబ్బందితో సమావేశమయ్యారు. సబ్సిడీ విత్తన వేరుశనగ, కందులకు రైతులు ఎంత మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారు.. ఎన్ని క్వింటాళ్లు పంపిణీ చేశారని ఆరా తీశారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్త శశికళ, ఏడీఏ శైలజాకుమారి, టెక్నికల్ ఏఓ శ్రీనివాసులు, మండల వ్యవసాయాధికారి విజయ కుమార్, ఏఈఓ శైలజ, హార్టికల్చర్ ఆఫీసర్ నెట్టికంటయ్య, ఆర్బీకే సిబ్బంది, ఎంపీఈఓలు పాల్గొన్నారు.

చికెన్, మటన్ సెంటర్ల తనిఖీ


చికెన్ సెంటర్‌ను తనిఖీ చేస్తున్న కమిషనర్ శ్రీనివాసులు

గుత్తి: పట్టణంలోని పలు చికెన్, మటన్, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లను బుధవారం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఎన్టీఆర్ సర్కిల్ వద్ద నుంచి రాయల్ సర్కిల్ వరకు రోడ్డుకు ఇరు పక్కలా ఉన్న చికెన్, మటన్, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో పరిశుభ్రతను పరిశీలించారు. అపరిశుభ్రంగా ఉన్న ఐదు చికెన్ సెంటర్లను మూయించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నిబంధనలు పాటించని, పరిశుభ్రంగా లేని చికెన్, మటన్, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లను సీజ్ చేయడంతో పాటు భారీగా జరిమానా విధిస్తామని హెచ్చరించారు. ఇక నుంచి నిర్వాహకులు తప్పకుండా పరిశుభ్రతను పాటించాలన్నారు. సచివాలయ హెల్త్ అసిస్టెంట్లు, శానిటరీ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

కనుల పండువగా కల్యాణోత్సవం


ప్రత్యేక అలంకరణలో ఉత్సవ విగ్రహాలు


పూజలందుకున్న సుబ్రహ్మణ్యేశ్వరుడు

ఆత్మకూరు: పంపనూరులోని సర్పరూప సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో బుధవారం జ్యేష్టశుద్ధ షష్టి సందర్భంగా కల్యాణోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో శ్రీవల్లి, దేవసేన, సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలతో అలంకరించారు. అనంతరం మేళతాళాలు, వేద పండితుల మంత్రోచ్ఛారణలు, పసుపు, కుంకుమ కలిపిన అక్షింతులతో కల్యాణం జరిపించారు. అనంతరం సుబ్రహ్మణ్యేశ్వరుడి మూల విరాట్‌ను ప్రత్యేకంగా అలంకరించారు. పంచామృతాభిషేకాలు, విశేష పూజలు చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

బాల కార్మిక వ్యవస్థను నిర్మూలిద్దాం


మాట్లాడుతున్న జూనియల్ సివిల్ జడ్జి సుభాన్

కళ్యాణదుర్గం: బాల కార్మిక వ్యవస్థను నిర్మూలిద్దామని కళ్యాణదుర్గం జూనియర్ సివిల్ జడ్జి సుభాన్ అన్నారు. స్థానిక కోర్టు ఆవరణలో బుధవారం ప్రపంచ బాల కార్మికుల వ్యతిరేక దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ.. బాల కార్మికులకు విద్యను అందించి దేశానికి ఉపయోగపడేలా తీర్చిదిద్దాల్సిన అవసరం మనందరిపై ఉందన్నారు. ప్రపంచంలో నానాటికీ పెరుగుతున్న బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించడానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా కృషి చేయాలని సూచించారు. బాలలు పనులకు వెళ్లకుండా బడికి పంపేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు కరణం తిప్పేస్వామి, దేవేంద్ర, హరి చక్రవర్తి, ముత్యాలప్ప, దాదాఖలందర్, రామ్మూర్తి, బీటీ రామాంజనేయులు, తులసీనాయక్, ఎర్రిస్వామి, టి.రామాంజినేయులు చ తిమ్మచౌదరిలతో పాటు పలువురు కక్షిదారులు, ప్రజలు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ వద్దే పోస్టల్ ఖాతాలు ప్రారంభం


గర్భిణులకు ఖాతాలు ప్రారంభిస్తున్న పోస్టల్ అధికారులు

కూడేరు: ప్రధాన మంత్రి మాతృత్వ వందన యోజన కింద గర్భిణులకు విడతల వారీగా వారి ఖాతాల్లోకి రూ.6 వేల నగదు జమవుతుంది. పోస్టాఫీసుల్లో ఖాతా చేయించుకుంటే వారి గ్రామాల్లోనే నగదు పొందడానికి వీలుంటుందని వైద్య శాఖ ఉన్నతాధికారులు సూచించారు. దీంతో గర్భిణులకు ఇబ్బంది లేకుండా పోస్టల్ అధికారులే బుధవారం కూడేరు పీహెచ్‌సీకి వెళ్లి గర్భిణుల పేరిట పోస్టల్ ఖాతాలు ఓపెన్ చేశారు. ఇంకా ఖాతాలు చేయించుకోని గర్భిణులు పోస్టాఫీసుల్లో చేయించుకోవాలని మండల వైద్యాధికారి సౌమ్యారెడ్డి సూచించారు.

సుబ్రహ్మణ్యేశ్వరా పాహిమాం


శివబాలయోగి ఆశ్రమంలో పూజలందుకున్న సుబ్రహ్మణ్యేశ్వరుడు


హెచ్చెల్సీ కాలనీలోని మంజునాథ అన్నపూర్ణ ఆలయంలో అలంకార సేవలు

అనంతపురం కల్చరల్: సుబ్రమణ్యేశ్వర పాహిమాం అంటూ భక్తుల నామస్మరణతో కుమార స్వామి బుధవారం విశేష పూజలందుకున్నాడు. జ్యేష్టశుద్ధ షష్ఠి సందర్భంగా పలుచోట్ల విశేష పూజలు, కల్యాణోత్సవాలు కమనీయంగా జరిగాయి. నగరంలోని హెచ్చెల్సీ కాలనీలోని అన్నపూర్ణ మంజునాథేశ్వర ఆలయంలో సుబ్రమణ్యేశ్వరుడికి విశేష పూజలు నిర్వహించారు. ప్రధాన అర్చకుడు బసవరాజ స్వామి ఆధ్వర్యంలో అభిషేకాలు, అలంకార సేవల్లో స్వామి భక్తులకు దర్శనమిచ్చాడు. అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు. అదేవిధంగా నగర శివారులోని శివబాలయోగి ఆశ్రమంలో శ్రీవల్లి సమేత సుబ్రమణ్యేశ్వరుడికి పంచామృతాభిషేకాలు, అర్చనలు చేపట్టారు. జూటూరు అరవింద్, రత్నగిరి దేవరాజ్ ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ జరిగింది. చెరువుకట్ట, మారుతీనగర్ తదితర చోట్ల షష్ఠి వేడుకలు భక్తిశ్రద్ధలతో సాగాయి.

జోరుగా ఇంటర్ అడ్మిషన్లు


ఏపీ మోడల్ కళాశాలలో ఇంటర్ అడ్మిషన్లు చేసుకుంటున్న సిబ్బంది

రాయదుర్గంటౌన్: ప్రభుత్వ ఇంటర్మీడియట్ కళాశాలల్లో ఇంటర్ అడ్మిషన్లు జోరుగా సాగుతున్నాయి. జూన్ మొదటి వారం నుంచే జూనియర్ కళాశాలలు అధికారికంగా పనిచేస్తున్నాయి. ఉజ్వల భవిష్యత్తు, మంచి మౌలిక వసతుల కల్పన, నాణ్యమైన విద్యాబోధన కోసం ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చేరాలని అధ్యాపకులు సైతం ప్రచారం నిర్వహించారు. గడిచిన వారం రోజుల నుంచి మొదటి సంవత్సరం ఇంటర్‌లో అడ్మిషన్లు ఊపందుకున్నాయి. రాయదుర్గం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ బాలికల కళాశాలతో పాటు కేజీబీవీ, ఏపీ మోడల్ కళాశాలలు ఉన్నాయి. మరోవైపు ఇంటర్ సెకండియర్ తరగుతులు ప్రారంభమయ్యాయి. గత ఏడాదితో పాటు పోల్చితే ఈ ఏడాది పదో తరగతి ఫలితాల్లో ఉత్తీర్ణత శాతం పెరగడంతో అడ్మిషన్లు సైతం బాగుంటాయని అధికారులు భావిస్తున్నారు. పట్టణంలోని ఏపీ మోడల్ కళాశాలలో ఇప్పటి దాకా 105 మందిని అడ్మిషన్ చేసుకున్నట్లు ప్రిన్సిపాల్ వెంకటేశులు తెలిపారు. అలాగే ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 166 మందికి ప్రవేశం కల్పించినట్లు ప్రిన్సిపాల్ వీరేష్, బాలికల జూనియర్ కళాశాలలో 110 మంది చేరినట్లు ప్రిన్సిపాల్ విజయ్‌భాస్కర్ తెలిపారు.

హాస్టల్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

కూడేరు: మండల కేంద్రం కూడేరులోని ఎస్సీ బాలుర వసతి గృహంలో 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రవేశం కోసం అర్హత ఉన్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని వార్డెన్ గురుప్రసాద్ కోరారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ వసతి గృహంలో 100 సీట్లు ఉన్నాయన్నారు. ఇప్పటికే 40 మంది విద్యార్థులున్నారన్నారు. మిగిలిన 60 సీట్లను గురువారం నుంచి భర్తీ చేయనున్నట్లు చెప్పారు. దరఖాస్తులు హాస్టల్‌లో లభిస్తాయని పేర్కొన్నారు.

వజ్రకరూరులో భారీవర్షం


వజ్రకరూరు పరిసర ప్రాంతంలో నిలిచిన వర్షపు నీరు

వజ్రకరూరు: మండల కేంద్రం వజ్రకరూరులో బుధవారం భారీవర్షం కురిసింది. ఉదయం 12 గంటలకు ప్రారంభమైన వర్షం రాత్రివరకు కొనసాగింది. ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి కాలనీల్లో పెద్ద ఎత్తున నీరు పారింది. వజ్రకరూరు పరిసర ప్రాంతంలోని పొలాలన్నీ వర్షపు నీటితో కనిపించాయి. సకాలంలో వానలు పడుతుండటంతో రైతులు పంటల సాగుకు సిద్ధమవుతున్నారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

కుందుర్పి: వర్షాలు కురుస్తున్న తరుణంలో వైద్య సిబ్బంది గ్రామాల్లో అప్రమత్తంగా ఉండాలని డాక్టర్లు నారాయణ స్వామి, అనూష, సోమేష్‌కుమార్ సూచించారు. బుధవారం స్థానిక ఆరోగ్య వైద్య కేంద్రంలో అన్ని గ్రామాల వైద్య సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామాల్లో ప్రజాప్రతినిధులతో మమేకమై పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకోవాలన్నారు. దోమలను పూర్తిగా నివారించాలన్నారు. మలేరియా, డెంగీ, టైఫాయిడ్ తదితర వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. సిబ్బంది వారికి కేటాయించిన గ్రామాల్లో స్థానికంగా ఉంటూ ప్రజలకు సేవలందించాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

గార్లదిన్నె: స్థానిక మోడల్ స్కూల్లో 7,8,9 వ తరగతిలో మిగిలిన సీట్లు భర్తీ కోసం అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ సతీష్ పేర్కొన్నారు. బుధవారం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఈనెల 15 లోపు విద్యార్థులు పాఠశాల వద్దకు వచ్చి దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈనెల 19న పాఠశాలలో విద్యార్థులకు ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామన్నారు. పరీక్షలో వచ్చిన మార్కులు ఆధారంగా సీట్లు కేటాయిస్తామన్నారు.

తెలుగు జాతి ఆణిముత్యం 'సినారె'


సినారె చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న రచయితలు, కవులు

అనంతపురం కల్చరల్: తెలుగుజాతి సాహితీ అణిముత్యం సినారె అని పలువురు వక్తలు కొనియాడారు. బుధవారం స్థానిక విశాలాంధ్రబుక్ హౌస్‌లో ప్రసిద్ధ కవి, రచయిత సి.నారాయణరెడ్డి వర్ధంతి సందర్భంగా అనంత రచయితలు, సాహితీ సంఘాల వ్యవస్థాపకులు నాగలింగయ్య, రియాజుద్దీన్, ఈరన్న, టీవీరెడ్డి, నానీల నాగేంద్ర, హరీష్, ప్రవీణ్ తదితరులు సినారె చిత్రపటం వద్ద ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జ్ఞానపీఠ్ అవార్డు గ్రహీతగా, సినీగేయ రచయితగా, విమర్శకునిగా బహుముఖ ప్రజ్ఞతో తెలుగు వారి హృదయాల్లో చిరస్మరణీయుడిగా నిలిచిపోయిన సినారె జీవితం ఆదర్శప్రాయమన్నారు. నాగార్జున సాగరం, వసంత కర్పూర రాయలు, మట్టిమనిషి ఆకాశం, రుతుచక్రం, ప్రపంచ పదులు, సినారె గజల్స్ వంటి అనేక కావ్యాల ద్వారా ఎంతో మందికి స్ఫూర్తినిచ్చిన ఆ కలం తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసిందన్నారు. మానవతావాదిగా ఆయన కావ్యాలు అజరామరమని కొనియాడారు.

'విద్యార్థులతో గదులు శుభ్రం చేయించొద్దు'

పెద్దవడుగూరు: పాఠశాలలు పునః ప్రారంభం అవుతున్న నేపథ్యంలో విద్యార్థులతో తరగతి గదులు శుభ్రం చేయించొద్దని ఎంఈఓ రాముడు ఉపాధ్యాయులకు సూచించారు. ఉపాధ్యాయులు సకాలంలో విధులకు హాజరుకావాలని ఆదేశించారు. విద్యార్థులకు ప్రభుత్వం సరఫరా చేసిన సామగ్రిని అందించాలన్నారు.

శుభ్రతతో పుండ్లకు చెక్


శుభ్రత గురించి వివరిస్తున్న డీపీఎంఓ తిప్పేస్వామి

కూడేరు: కుష్టు వ్యాధిగ్రస్తులు తమ కాళ్లు, చేతి వేళ్లను రోజూ నీటితో శుభ్రం చేసుకుంటే పుండ్లు కాకుండా అరికట్టవచ్చని డీపీఎంఓ తిప్పేస్వామి అన్నారు. బుధవారం మండల పరిధిలోని కుష్టు రోగుల కాలనీలో వైకల్య నివారణ, పునరావస శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా కాళ్లు, చేతి వేళ్లు పుండ్లు కాకుండా టబ్ నీటిలో ఏ విధంగా శుభ్రం చేసుకోవాలో డీపీఎంఓ అవగాహన కల్పించారు. ప్రాథమిక దశలోనే కుష్టు వ్యాధి లక్షణాలను గుర్తించి చికిత్స పొందితే పూర్తిగా నయం చేయవచ్చని సూచించారు. అనంతరం ఆయన కుష్టు వ్యాధిగ్రస్తులకు పాదరక్షలు, మందులను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రవీంద్ర, ఎంపీఎంఏ శివప్రసాద్, ఎంఎల్‌హెచ్‌పీ చంద్రకళ, ఏఎన్ఎం భాను, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.